క్లుప్తంగా

నెట్టికంటుడి సేవలో విజిలెన్స్ ఎస్పీ



స్వామి ఆశీర్వచనాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి గురువారం సాయత్రం ఆలయానికి విచ్చేసిన ఆమెకు అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ చౌడేశ్వరి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కసాపురంలో ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధన్వంతరి హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పరామర్శ



విజయలక్ష్మిని పరామర్శిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని అయ్యవారుపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి గత కొన్ని నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. భర్తను పోగొట్టుకొని అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే బైపాస్ సర్జరీ చేయించుకున్న విజయలక్ష్మి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి గురువారం ఆ గ్రామానికి చేరుకొని విజయలక్ష్మిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం కర్నూలుకు చెందిన ఓమిని ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్ మియా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రకాష్ రెడ్డి, సంతోష్ నాయక్ తదితరులు మున్సిపల్ అధికారులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులను పరీక్షించారు. ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2 డీ ఈకో వంటి పరీక్షలు చేశారు. కమిషనర్, చైర్‌పర్సన్ కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు బేతాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం పాఠశాలలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. విద్యార్థులు ఎత్తుకు తగిన బరువు ఉన్నారా లేదా అని పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం చూశారు. అనంతరం విద్యార్థుల హాస్టల్ గదులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ విజయకుమార్, వైద్య సిబ్బంది లాజరస్, సుధ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎంపిక



ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు

గుత్తి: పట్టణంలో గురువారం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా బాలాజీ, కార్యదర్శిగా నవీన్ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధను, సహాయ కార్యదర్శులుగా హఫీజ్, అఖిల్, ఉపాధ్యక్షులుగా శరత్, బాషాతో పాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.

పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

- 1200 ఓట్లకు ఒక పోలింగ్ కేంద్రం
- తాడిపత్రి నియోజక వర్గంలో అదనంగా 47 పోలింగ్ కేంద్రాలు
- నేడు కలెక్టరేట్‌లో పొలిటికల్ మీటింగ్



కొత్త పోలింగ్ కేంద్రాల ఎంపికపై సర్వే చేస్తున్న అధికారులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. వివరాలు.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇకపై ఎన్నికల పోలింగ్ కేంద్రాలు 1200 ఓట్లకు పరిమితం కానున్నాయి. ఈ నిర్ణయంతో కూతవేటు దూరంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకూ ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 ఓట్ల వరకూ ఉండేవి. పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు అధికంగా ఉండటంతో ఎన్నికల సమయంలో అధికారులు పలు రకాల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గంటల తరబడి క్యూలో నిలిచి ఓట్లు వేయడానికి ఓటర్లు నిరీక్షించాల్సి వస్తోంది. దీని కారణంగా అనేకమంది ఓటింగ్‌కు దూరమవుతున్నారు. పోలింగ్ శాతం ఏటా తగ్గుతూ వస్తోంది. మరోవైపు సమయానికి పోలింగ్ పూర్తి కాక పోవడంతో పాటు రాత్రి 10 గంటలు దాటుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటం వల్ల వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఓటు వేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సంఘం కేవలం 1200 ఓట్లకు పోలింగ్ కేంద్రాలను పరిమితం చేయడంపై కసరత్తు చేయాలని కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో 1200 ఓట్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, విడదీసిన ఓటర్లను అనుకూలంగా ఉన్న చోట కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి అందులో కలపాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాడిపత్రి నియోజక వర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 47 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఎంపిక చేశారు. తాడిపత్రి పట్టణంలో మునిసిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ, టీపీఓ సుజాత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఆయా మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది కలిసి సర్వే చేశారు. కొత్త పోలింగ్ కేంద్రాలకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్ బిల్డింగ్‌లను ఎంపిక చేశారు. తాడిపత్రి పట్టణంలో మొత్తం 78 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 1200 కంటే ఎక్కువ ఓట్లున్న నందలపాడు, శ్రీనివాసపురం, టైలర్స్‌కాలనీ, చేనేతకాలని,చర్చిస్కూల్, మొదటి వార్డు తదితర పోలింగ్ కేంద్రాలను విభజిస్తూ అదనంగా 35 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేస్తూ నివేదికను తయారుచేశారు. తాడిపత్రి మండలంలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాలకు గానూ గన్నెవారిపల్లి కాలనీలో రెండు, తేరన్నపల్లి, గంగాదేవిపల్లి, చుక్కలూరు, చిన్నపోలమడ, యాడికి మండలంలో మొత్తం 55 పోలింగ్ కేంద్రాలు ఉండగా గుడిపాడు, రాయలచెరువు, పెద్దవడుగూరు మండలంలో కిష్టిపాడులో రెండు, మిడుతూరులో ఒక పోలింగ్ కేంద్రాన్ని పెంచారు. పెద్దపప్పూరు మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని కూడా పెంచలేదు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

1200 ఓట్లకు పరిమితం చేస్తూ కొత్తగా ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలు, మార్పులు, చేర్పులపై చేసిన కసరత్తు వివరాలపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులతో సమావేశం జరుగనుంది. జిల్లాలోని ఏడు నియోజవర్గాల్లో 1200 ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలతో పాటు 1200 ఓట్లకు పరిమితం చేస్తూ కొత్తగా ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను వారం రోజుల క్రితం నియోజక వర్గాలకు చెందిన అధికారులు కలెక్టర్ కార్యాలయానికి పంపారు. ఆయా వివరాలను రాజకీయ పార్టీ నాయకుల దృష్టికి తీసుకురానున్నారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

ప్రజలకు చంద్రబాబు కుచ్చుటోపీ



నార్పల మండలం కేసేపల్లిలో ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న సాకే శైలజనాథ్

నార్పల/యాడికి: ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు కుచ్చుటోపీ పెట్టాడని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ ధ్వజమెత్తారు. కేసేపల్లి, కురగానపల్లి గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కేసేపల్లిలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. శైలజనాథ్ మాట్లాడుతూ చంద్రబాబు హామీలను నెరవేర్చలేని అసమర్థ నాయకుడన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు సృష్టిస్తున్నాడన్నారు. ఎన్నికల్లో చేతకాని హామీలిచ్చి, గెలుపొందాక ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేక ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణుల అమితమైన ప్రజాదరణ వస్తోందన్నారు. అనంతరం బాబు మోసాలకు సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించి ప్రజలకు జరిగిన మోసం వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి (అనంతపురం పార్లమెంట్) నార్పల సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మంత్రి ఆంజనేయులు,వలంటీర్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి జయరామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఎంపీటీసీ సావిత్రి, లింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, క్రిష్ణమూర్తి, కురుగానపల్లి గోపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రాంచంద్రరెడ్డి, రామలింగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాడికి మండలం భోగాలకట్టలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

హామీలు అమలు చేయకుండా మోసం

– యాడికి మండలంలోని బోగాల కట్ట, రాయలచెరువులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ .. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, జిల్లా విభాగ కార్యదర్శి తలారీ నాగేష్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో కోనుప్పలపాడు కోనా వెంకట శివారెడ్డి, జగదీశ్వర నాయుడు, జిలాన్‌బాషా, రషీద్, రంగనాథ్, అనిల్‌బాషా, హనుమంత రెడ్డి, రామచంద్రారెడ్డి, కంబగిరి రెడ్డి, నగరూరు ఉప సర్పంచు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం మరచిన ‘కూటమి’



శింగనమల కేజీబీవీలో మాట్లాడుతున్న మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి



పామిడిలో విద్యార్థులతో మాట్లాడుతున్న వంశీయాదవ్

శింగనమల/పామిడి: కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి విమర్శించారు. గురువారం శింగనమల కేజీబీవీలో విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించిన బ్యాగులు నెల రోజులకే చినిగిపోయాయన్నారు. విద్యార్థినులకు నాసిరకం భోజనం పెడుతున్నారన్నారు. గత విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇవ్వలేదని, ఈవిద్యా సంవత్సరంలో కూడా అనేక కారణాలతో తల్లికి వందనం ఇవ్వకుండా నిలిపివేశారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుల్తాన్ ఆదాం, జిల్లా మాజీఅధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నిశాంత్‌రెడ్డి, నాయకులు మునికుమార్, సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలోని హాస్టల్‌ను వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ యాదవ్ మాట్లాడుతూ చాలీచాలని మెస్ చార్జీల వల్ల ప్రభుత్వ హాస్ట విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు వర్తింపజేస్తున్న మెస్ ఛార్జీలు సరిపడక పోవడంతో మెనూలో నాణ్యతా ప్రమాణాలకు త్రిలోదకాలు ఇస్తున్నారన్నారు. రెండునెలలైనా దుప్పట్లు, దోమతెరలు, ట్రంకు పెట్టెలు, బ్యాగులు ఇచ్చిన పాపానపోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంతోపాటు మంచి భోజనం, మౌళిక అవసరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు జిలాన్, ఉపాధ్యక్షుడు రమేష్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు వినోద్, యువజన విభాగం నాయకులు దినేష్, శివ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

గార్లదిన్నె: బహిరంగ ప్రదేశాలు, హోటళ్లు, ధాబాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేషులు హెచ్చరించారు. గురువారం సీఐ కొలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషాతో కలసి డీఎస్పీ ధాబాలు తనిఖీ చేశారు. ఓ ధాబాలో మద్యం సేవిస్తున్న ఎనిమిది మంది యువకులు, ధాబా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ అనుమతి లేకుండా ధాబా, హోటళ్లలో మద్యం తాగించిన, తాగిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం 44వ జాతీయ రహదారిలో నిబంధనలు పాటించని వాహనాలను ఆపి జరిమాన విధించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

గుంతకల్లు రూరల్/పుట్లూరు/పెద్దపప్పూరు/తాడిపత్రి రూరల్ : హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. గురువారం గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి, జేవీవీరాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని చింతకుంటలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు, వీఆర్ఓ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దపప్పూరు మండలంలోని చాగల్లులో తహసీల్దార్ బాలాజీరాజు,ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ శంకుంతల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. అలాగే తాడిపత్రి మండలంలోని చిన్నపోలమడలో పౌరహక్కుల దినోత్సవం నామమాత్రంగా జరగడంపై స్థానిలు మండిపడుతున్నారు.

నెట్టికంటుడికి వెండి వితరణ

గుంతకల్లు రూరల్: గుంతకల్లు పట్టణానికి చెందిన బండారు నగేష్ అనే భక్తుడు గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి అర కిలో వెండిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

ముఖ్య అర్చకులుగా పదోన్నతి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇద్దరికి ముఖ్య అర్చకులుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఈఓ కే.వాణి నియామక పత్రాలను అందజేశారు. అర్చకులు కె.ఎస్.ఎం. చక్రవర్తి, జయవర్ధన్‌కు ముఖ్య అర్చకులుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఈఓ తెలిపారు.


లోతాకేశ్వర స్వామి ఆలయంలో పూజలు

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామ సమీపంలో వెలసిన లోతాకేశ్వర స్వామి ఆలయంలో గురువారం చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పురాతన ఆలయమైన లోతాకేశ్వర ఆలయం, స్వామివారి విగ్రహం క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ క్రమంలో నెలగొండ, అనంపల్లి, కమలపాడు, పులగుట్టపల్లి, పులగుట్టపల్లి పెద్దతండా గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వేద పండితుల చేత అగ్నిహోమం, గంగ పూజ, గోపూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

ఇంట్లో పాము కలకలం

గుత్తి: పట్టణంలోని గాంధీ నగర్‌లో ఓ పాము గురువారం కలకలం రేపింది. చిన్న మద్దయ్య ఇంటిలోకి పాము ప్రవేశించింది. మద్దయ్య కుటుంబ సభ్యులు పామును చూసి ఇంట్లోంచి బయటకు పరుగులు తీశారు. పాములు పట్టే వ్యక్తికి సమాచారం ఇవ్వడంతో అతను పామును పట్టి బయలు ప్రదేశంలో వదిలివేశాడు.

రూ.8.77 కోట్లతో సోలార్ వ్యవస్థ



మాట్లాడుతున్న చైర్మన్ జేసీప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మునిసిపాటిలో సోలార్ విద్యుత్ వ్యవస్థ కోసం రూ.8.77కోట్లను ఖర్చు చేయనున్నామని చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ తలారి అరుణ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మునిసిపాలిటిలో నీటి సరఫరా, విద్యుత్ లైట్లు, కార్యాలయంలో విద్యుత్ సౌకర్యం కోసం ప్రతి నెలా రూ.32 లక్షల కరెంట్ బిల్లు వస్తోందన్నారు. సోలార్ విద్యుత్ ద్వారా రూ.22 లక్షలు ఆదా అవుతుందన్నారు. చెత్త సేకరణలో వాహనాల సమస్య తలెత్తకుండా ప్రభుత్వం వేలం వేయనున్న ఆటో రిక్షాలను కొనుగోలు చేస్తామన్నారు. పెన్నా బండ్‌లో యువత కోసం, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, అభిరుచి తదితర ప్రాంతాల్లో ఫుడ్ కోర్టుల కోసం మిగతా వర్గాల ఉపాధి కోసం స్థలాలను కేటాయిస్తామన్నారు. ఒక్కొక్కరు రూ.2.50 లక్షలు డిపాజిట్ చెల్లిస్తే ఏడాది వరకు అద్దెలు ఉండవన్నారు. అనంతరం పలు తీర్మానాలకు సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. నీటి సరఫరా నిర్వహణ కోసం మోటర్లు, పంపుల కొనుగోలు కోసం రూ.4.18లక్షల టెండర్‌ను ఆమోదించారు. మంచినీటిలో కలిపే క్లోరిన్ గ్యాస్ సిలిండర్లు, విడిభాగాల కోసం రూ.10.15లక్షల టెండర్‌కు ఆమోదం తెలిపారు. రూ.4.20 లక్షలతో క్రిష్ణాపురం 7వ రోడ్డు ప్రధాన రహదారి, నంద్యాలరోడ్డులోని ఒక్కడు డాబా వద్ద అండర్ డ్రైనేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ పైపుల కోసం ఆమోదించారు. పట్టణంలో 2010లో వేసిన అండర్ డ్రైనేజీ పైపులు దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త వాటి కోసం రూ.65 లక్షలకు ఆమోదం తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా క్రిష్ణాపురం జీరో రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి యాక్సిస్ బ్యాంకు వరకు డివైడర్లు, చెట్లకు పెయింటింగ్ కోసం రూ.6లక్షలు కేటాయించారు. పెన్నానదిలో రెండు రోజుల పాటు ఆక్రమణ తొలగింపు కోసం రూ.3.20 లక్షలు కేటాయించారు.పట్టణంలోని సంజీవనగర్‌లోని సాయిబాబా దేవాలయం వరకు పైప్‌లైన్, సిమెంట్ రోడ్డు కోసం రూ.40.50 లక్షలను మంజూరు చేస్తూ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఒకేరోజు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పర్యటన

గుంతకల్లు రూరల్: పొలం రస్తా వివాదంపై పరిశీలన, సివిల్ సప్లై స్టాకు పాయింట్ పరిశీలన, బఫర్ పాయింట్ పరిశీలనతో భాగంగా గురువారం ఒకే రోజు గుంతకల్లులో ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పర్యటించారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతులు సాలప్ప, అజయ్ ప్రసాద్ మధ్య కొంత కాలంగా పొలం రస్తా వివాదం కొనసాగుతున్న క్రమంలో సమస్య జిల్లా కలెక్టర్ వరకూ వెళ్లింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ గురువారం తిమ్మాపురం వెళ్లి వివాదానికి కారణమైన రస్తాను పరిశీలించి, రైతుల అభిప్రాయాలు, రికార్డులను పరిశీలించారు. అదే విధంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు స్థానిక మార్కెట్ యార్డులోని సివిల్ సప్‌లైయ్స్ స్టాకు పాయింట్‌ను తనిఖీ చేశారు. స్టాకుతోపాటు, రికార్డులను పరిశీలించారు. అలాగే స్థానిక బళ్లారి రోడ్డులోని బఫర్ గోడౌన్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తనిఖీ చేశారు. రికార్డుల పరంగా జిల్లా వ్యాపంగా ఉన్న బఫర్ వివరాలను తెలుసుకోవడంతోపాటు, అందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ రమాదేవి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, ఇతర రెవిన్యూ సిబ్బంది వారి వెంటన్నారు.



మార్కెట్ యార్డులోని బఫర్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు



బఫర్ గోడౌన్‌లో స్టాకును పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్



పొలం రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

శుభకార్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పీఆర్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య కుమార్తె వివాహానికి గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేతలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే నియోజకవర్గంలో పలు శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

యాడికి: మండలంలోని చందన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాములమ్మ, దేవరాజు దంపతుల కుమార్తె లక్ష్మి మౌనిక-వినయ్ కుమార్ వివాహం పులివెందుల తాలూకా తొండూరు మండలం మడూరు గ్రామంలో జరిగింది. వివాహానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్య క్రమంలో నాయకులు శివకేశవరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొ న్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

యాడికి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని తాడిపత్రి మలేరియా నివారణాధికారి శ్రీనివాసులు సూచించారు. గురువారం రాయలచెరువు పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలకు, ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలకు వెళ్లినపుడు ప్రజలకు దోమకాటువల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించి, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అంతకు ముందు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయూష్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



డాక్టర్ మహమ్మద్ షాకీర్

గుత్తి: పట్టణానికి చెందిన ఎక్స్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దండియా మహమ్మద్ షఫి కుమారుడు డాక్టర్ దండియా మహమ్మద్ షాకీర్ ఆయూష్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్ ఎంట్రెన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. గత బుధవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పరీక్షా ఫలితాలను ప్రకటించింది. దండియా మహమ్మద్ షాకీర్ ఆల్ ఇండియాలో 880 ర్యాంక్, కేటగిరిలో 282 ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్థానికులు దండియా మహమ్మద్ షాకీర్‌ను అభినందించారు.

రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడి మృతి



వి.ఎల్.గుప్త (ఫైల్)

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ మాజీ పట్టణ అధ్యక్షుడు, రోటరీ హైస్కూల్ మాజీ కరస్పాండెంట్ వి.లక్ష్మీనారాయణ గుప్త(72) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. వివరాలు.. వైఎస్సార్ కడపలో తన సమీప బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలసి ఆయన గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. రైలు కోసం వేచి ఉన్న వీఎల్.గుప్తకు ఒక్కసారిగా చాతీ నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. 108 వాహనంలో అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుప్త మృతిపై రోటేరియన్లు సంతాపం తెలిపారు.

రజక సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మీరంగయ్య



తాడిపత్రిటౌన్: రజక సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాడిపత్రికి చెందిన లక్ష్మీరంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఓ హోటల్‌లో గత మంగళవారం రజక సేవా సంఘం కార్యవర్గ ఎంపిక చేశారు. లక్ష్మీరంగయ్య ఎంపికపై పలువురు రజకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

యాడికి: పెద్దపప్పూరు మండల కేంద్రంలోని చీమలవాగుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పాంజలి గురువారం పదవీ విరమణ పొందడంతో ఉపాధ్యాయులు, స్నేహితులు బంధువులు ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు చౌడమ్మ, మహబూబ్ బాషా, సుందర రావు, జయప్రసాద్, ఆర్‌పీ నాగభూషణం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యునాని కాంపౌండర్‌కు సన్మానం

యాడికి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న యునాని ఆస్పత్రి కాంపౌండర్ యేసు గురువారం పదవీ విరమణ పొందారు. దీంతో కర్నూల్ జిల్లాకు చెందిన యునాని మెడికల్ ఆఫీసర్ అశోక్, యాడికి వైద్యాధికారి సుమంత్ రెడ్డి, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, తాడిపత్రికి చెందిన యునాని వైద్య సిబ్బంది శాలువాలు, పూలమాలలతో యేసు-కరుణమ్మ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్య బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.